మొదటి భారతీయ అరాచకవాద తత్వవేత్త ఎం.పి.టి. ఆచార్య స్మృతిలో...

# ఈనాటి పీడితులకోసం
# వీర్ నారాయన్‌సింగ్ వీలునామా

## ( విస్మృత యోధుడి అమరగాథ )



హిందీ మూలం

**శంకర్ గుహ నియోగి**

సంక్షిప్త తెలుగు పరిచయం

**గౌరవ్**

ప్రచురణ

**కొశాంబి స్టడీ సర్కిల్**

తెలుగు రాష్ట్రాలు

# మొదటి భారతీయ అరాచకవాద తత్వవేత్త ఎం.పి.టి ఆచార్య స్మృతిలో
# ఈనాటి పీడితుల కోసం వీర నారాయణ సింగ్ వీలునామా
## ( విస్మృత యోధుడి అమరగాథ)

హిందీ మూలం

**శంకర గుహ నియోగి**

సంక్షిప్త తెలుగు పరిచయం

**గౌరవ్**

ముద్రణ : **ఫిబ్రవరి 14 ,2024**

(శంకర్ గుహ నియోగి 80వ జయంతి )

ప్రచురణ

**కొశాంబి స్టడీ సర్కిల్**

తెలుగు రాష్ట్రాలు

మూల్యం

**అమూల్యం**

కాపీలెఫ్ట్

సర్వహక్కులు : సమాజానికి

విజ్ఞప్తి : ఇందులోని అభిప్రాయాలన్నింటితోనూ అనువాదకుడు, ప్రచురణకర్తలు అంగీకరించవలసిన అవసరం లేదు.

వివరాలకు

9032094492

gouravmeka@gmail.com

# అంకితం



**యం.పి.టి.ఆచార్య (1887-1954)**

యం.పి.టి.ఆచార్యగా ప్రసిద్ధి చెందిన మందయం పార్ధసారధి తిరుమల ఆచార్య భారతీయ స్వాతంత్ర్య సమర యోధుడు. మొట్టమొదటి భారతీయ అరాచకవాద తత్వవేత్తల్లో ఒకరు. యువకుడుగా సుబ్రహ్మణ్య భారతితో పనిచేసిన ఆచార్య సాంప్రదాయ తమిళ కుంటుంబంలో పుట్టారు.తండ్రి ప్రభుత్వ ఉద్యోగి. విప్లవ భావాలతో దేశం దాటిన ఆచార్య తనదైన జీవితాన్ని మలచుకున్నాడు. భారత కమ్యునిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకడు. అనేక మంది ప్రపంచ మేధావులు ఉద్యమకారులతో భుజం కలిపి తిరిగిన వ్యక్తి. ఎమ్మేన్ రాయ్ తన జ్ఞాపకాల్లో ఆచార్యను అంతగా ఇష్టపడ్డట్లు కనిపించదు. ఆచార్య 2వ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్లో రివల్యూషనరీ అసోసియేషన్ ప్రతినిధిగా పాల్గొన్నాడు. రాయ్ ఆధిపత్యాన్ని ప్రశ్నించినందుకుగాను వెలుపలకి పంపించారంటారు. అలెగ్జాండర్ బెర్క్మన్, ఎమ్మా గోల్డ్మన్, రుడాల్ఫ్ రాకర్ వంటి అరాచకవాద మహామహులతో పనిచేసిన ఏకైక భారతీయుడు. దక్షిణ దేశపు మొట్టమొదటి అరాచకవాద తత్వవేత్త ఆచార్య. మాగ్దానా చేమెన్ అనే ప్రసిద్ధి రష్యన్ కళాకారిణి, చిత్రకారిణి వివాహం చేసుకున్న ఆచార్య అంతర్జాతీయ శ్రామిక జన అనార్కోసిండికలిస్ట్ వ్యవస్థాపక సమావేశం నుండి మద్దుతుదారుడు. ప్రపంచ అరాచకత్వ ఉద్యమాన్ని, సాహిత్యాన్ని ఇండియాకు పరిచయం చేసిన ఆచార్య ఎన్నో అద్భుతమైన రచనలు చేసాడు. 'రిమినిసెన్సెస్ ఆఫ్ యాన్ ఇండియన్ రివల్యూషనరీ' పేరిట స్వీయగాథలు రాసాడు. జపనీస్ అరాచకవాది త్యాజియమగా మొదలు చైనీస్ అరాచకవాదైన బాజిన్ వరకు ప్రపంచంలో ఆయనకు పరిచయం లేని ఉద్యమకారులు లేరంటే అతిశయోక్తి కాదు. వోలె బిర్క్ లార్షన్ ఆచార్య సమగ్ర జీవితాన్ని గురించి ఎంతో పరిశోధించి 'అనార్కి ఆర్ కయాస్' అనే పుస్తకం రాసాడు. చివరి రోజుల్లో ముంబాయిలో వుంటూ అనారోగ్యంతో చనిపోయిన ఆచార్య దేశదేశాలలో విప్లవశక్తులకు ఆరాధ్యుడే. కాని సొంత దేశంలో విస్మృతుడు. ఆచార్య 70వ వర్ధంతి సందర్భంగా ఈ చిరునివాళినిలా.......

# ప్రస్తావన

పదేళ్ళ క్రితం 2013లో అమర్ అనే కలం పేరుతొ శ్రమైక్య ప్రచరణలు తరుపున ‘ శ్రామిక సారథి, కార్మిక వారధి : శంకర్ గుహ నియోగి ‘పేరిట మొదటి కరపత్రం పాతికేళ్ళ వయస్సులో ప్రచురించి పంచాను. నా ‘కరపత్రాల కథా కమామీషు ‘సంపుటిలో కూడా అదుంది. ఢిల్లీ రాజ్‌హార సరిగ్గా ఎప్పుడెళ్ళింది జ్ఞాపకం లేదు. కాని భగత్ సింగ్ 90వ వర్ధంతి సందర్భంగా పదిమంది యువజనుల వ్యాసాలతో సంకలనాన్ని శంకర్ గుహ నియోగి స్మృతిలోనే ప్రచురించాను. నాటి నుండి ఈ దేశ ప్రత్యామ్నాయ ప్రజా ఉద్యమాలకి నియోగి నిర్దేశించిన ‘సంఘర్ష్ ఔర్ నిర్మాణ్’, ‘విరోధి నహీ వికల్ప్’ మొదలైన నిర్మాణాత్మకత కలిగిన సూత్రాలకు అచ్చెరువొందుతూనే వుంటాను. పర్యావరణ సమస్య మొదలు ఆయన రాసిన లేఖల వరకూ అంతర్జాలంలో దొరికిన రచనలూ, అనిల్ సద్గోపాల్ మెదలు భరత్ డోగ్రే దాకా ఆయన రాసిన స్మృతులు A death : Few arguments నుండి lal johar వరకు వచ్చిన సినిమాలు, డాక్యుమెంటరీలు చూసినా, ఈ దేశ పీడిత ప్రజలకోసం నియోగి పడ్డ తపన, చేసిన అసాధారణ కృషి స్పష్టంగా కనిపిస్తుంది. బాల్యంలో నన్ను ఎంతగానో ప్రభావం చేసినటువంటి ఎన్నాళ్ళుగానో అనుకుంటున్న ఆచార్యకి అంకితంతో ఇదిలా ఇన్నాళ్ళు ఇన్నేళ్ళ ఆలస్యంగా తీసుకురావడం జరుగుతోంది. ఎందుకంటే ఆరంభ కరపత్రాల్లో ఆఖరు వాక్యాల్లో అన్నట్లు

**“నియోగి ఒక నిరంతర జ్వాల**
**నిజానికి అతనెప్పటికీ ఆరిపోడు”**

**– గౌరవ్**

# అనువాదకుడి మాట

'శంకర్ గుహ నియోగి' వ్యక్తి కాదు, ఆయనో ఆలోచనధార'. భారతదేశంలోనే కాదు, ప్రపంచ కార్మిక సంఘాల చరిత్రలో ఒక అవిస్మరణీయ మలుపు నియోగి. విద్య, వైద్యం, వ్యసన వ్యతిరేకత, సమిష్టితత్వాల్ని 'పోరాటం–నిర్మాణం'తో ప్రజాకీయాల్లోకి తీసుకువచ్చిన కార్మికనేత నియోగి. మైనింగ్ వ్యాపారులు, మద్యం తయారీదారులు కలసి కుట్ర పన్ని చరిత్రలో చేసిన ఏకైక ఘోరమైన హత్య నియోగిది. మద్యపాన నిషేధ ఉద్యమాన్ని కాదు, కార్మికులు స్వచ్ఛందంగా మద్యాన్ని త్యజించే వ్యసన వ్యతిరేక నిర్మూలనోద్యమాన్ని నిర్మించిన అరుదైన నాయకుడు నియోగి. ఆయన స్ఫూర్తితో ఈనాటికి శ్రామికవర్గ దృక్పథంలో కొనసాగుతున్న షహీద్ స్కూల్, షహీద్ హాస్పిటల్ అద్వితీయంగా వెలుగుతున్న నియోగి ఆశయాలు అమరత్వానికి ఆచరణ రూపాలే.

సరిగ్గా గుర్తులేదు కాని పది పదిహేనేళ్ళ క్రితం పనిగట్టుకుని ఢిల్లీ రాజ్ హరా వెళ్ళినప్పుడు ప్రేమగా తెచ్చుకున్న నియోగి రచనల్లో వున్న చిన్న పొత్తం, 'ఈనాటి పీడితుల కోసం, వీర్ నారాయణ సింగ్ వీలునామా.' చత్తీస్ఘర్ చరిత్రని మలుపు తిప్పిన స్వాతంత్ర్యోద్యమ వీరుడు వీర్ నారాయణ సింగ్ జీవితాన్ని గురించి అదే చత్తీస్ ఘర్ చరిత్రకు తన రక్తంతో కొత్త అర్థాన్ని ఇచ్చిన శంకర్ గుహ నియోగి చేసిన అన్వేషణ, పరిశోధన, ప్రయాణానుభవాల్ని గురించి స్వయంగా నియోగి రాసిన ఏకైక జీవితగాధ. మొదట సుమారు 50 ఏళ్ల క్రితం "చత్తీస్ఘర్ మహత్తర రైతు పోరాట మొట్టమొదట విప్లవ యోధుడు : వీర్ నారాయణ సింగ్ " పేరిట చత్తీస్ఘర్ మైన్స్ శ్రామిక సంఘ్" దీన్ని ప్రచురించింది. తర్వాత చత్తీస్ఘర్ ప్రథమ విప్లవకారుడు అమరుడు వీర్ నారాయణ సింగ్‌కి లాల్ జోహార్ పేరుతో నారాయణ సింగ్ వర్థంతి సందర్భంగా ప్రచురించడం జరిగింది. తర్వాత 'షహీద్ శంకర్ గుహ నియోగి యాద్‌గార్ సమితి' తరుపున ముద్రించారు. దీనికిచ్చిన నాటక రూపం కూడా నెట్లో వున్నది.

అయితే, ఈ పదిహేను సంవత్సరాల నుంచి ఇది నా దగ్గరే వుంది. ఆ మధ్య పుస్తకాలు సర్దుతుంటే శిధిలావస్థలోకి చేరిపోయిన ఈ పుస్తకం కంటబడింది. ఎక్కడో

అపరాధ భావన కలాన్ని తట్టిలేపింది. హిందీ నుండి ఇది నా రెండవ అనువాదం. మొదటిది హిమాంశు కుమార్ రచన 'అభివృద్ధి – ఆదివాసులు – హింస' కూడా చత్తీస్గఢ్ పరిస్థితి గురించి కాగా ఇప్పుడీ రచన కూడా ఆ నా జన్మభూమికి సంబంధించినదే. నియోగి జయంతి సందర్భంగా తీసుకొస్తున్న ఈ చిన్న అనువాదం ఇరువురు అమరుల్ని పరిచయం చేస్తుంది. ఆ మాటకొస్తే ఎం.పి.టి ఆచార్య గురించి ఒక ఉద్గ్రంథమే రాయాల్సి వుంది. ఆచార్య మరణించినప్పుడే భారతదేశంలో అరాచకవాద ఉద్యమం చనిపోయిందన్నారు. కాని అలా కాలేదు, కాదు కూడా.

కార్మికవర్గ చైతన్యానికి చరిత్ర రచనతో మడిపడి వున్న అవినాభావ సంబంధానికి చత్తీస్గఢ్ విముక్తి నేతలైన వీర్ నారాయణ సింగ్ చరిత్ర కోసం శంకర్ గుహ నియోగి జరిపిన శోధన, చేసిన అన్వేషణ ఒక సాక్ష్యం. ఒక ట్రేడ్ యూనియన్ పని పరిధి ఎంత విశాలమో, ఎంత విస్తృతమో తెలియజేసే కృషి ఇది. చత్తీస్గఢ్ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు తర్వాత నారాయణ సింగ్ గురించి ఎన్ని పరిశోధనలు జరిగినా వాటిన్నింటికీ తలమానికమైంది మాత్రం నియోగి స్వయంగా సోనెఖాన్ వెళ్ళి వెలికి తీసిన అమూల్యమైన అపూర్వ విషయ భాండాగారమే. ప్రజాపక్ష బుద్ధిజీవులకి తప్పనిసరిగ వుండి తీరవలసిన దార్శనిక దృష్టికి చిహ్నమిది. విదేశీ దోపిడీదార్ల చేతిలో మరణించిన వీర్ నారాయణ సింగ్, స్వదేశీ దోపిడీదార్ల చేతిలో హత్యకు గురైన అమరుడు శంకర్ గుహ నియోగిల ఉమ్మడి లక్ష్యం ఒక్కటే. అదే దోపిడీ, పీడనలు లేని సమతా సమాజం. అసమానతలు, అణిచివేతలు లేని ఆదర్శమానవ జీవనం. ఆ స్వప్నం ఇంకా ఫలించవల్సి వుంది.

చరిత్ర అధ్యయనమూ, పరిశీలనమూ, పరిశోధన దృక్పథానికి వాస్తవిక దృష్టికోణాన్ని కూర్చిన మేధావి, చరిత్రకారుడు డి.డి. కొశాంబి స్ఫూర్తితో చరిత్ర రచనపై కృషి చేయడం కోసం ఏర్పాటు చేసింది కొశాంబి స్టడీ సర్కిల్. నాలుగేళ్ళ క్రితం ఈ పేరుతో ముంబాయిలో ఒక సంస్థ ఏర్పడగా, ఢిల్లీలోని రాహుల్జీని కూడా కలుపుకుని సాంకృత్యాయన్ – కొశాంబి స్టడీ సర్కిల్ పేరిట యూనివర్సిటీ విద్యార్థులు 'లోకాయత్' నిర్మాణాత్మక కార్యక్రమాలు చేస్తున్నారు. కాగా కొశాంబి స్ఫూర్తితో మాజీ మావోయిస్టు నేత, సామాజిక కార్యకర్త కోబాడ్ గాంధీ కూడా ఈ మధ్య ఒక సమాలోచనా సంస్థను ఏర్పాటు చేసినట్టు frontierలో చూసాను. తెలుగులో బాలగోపాల్ నుండి వేణుగోపాల్ దాకా కొశాంబి రచనలను అందించిన బుద్ధిజీవులు

వున్నారు. నిజానికి చాలాకాలం క్రిందటే ఈ ఆలోచన నాకు వుంది. కొశాంబి రాసిన ఏకైక పిల్లల కథ తెలుగు చేసి కొన్నేళ్ళ క్రితం చిన్న పొత్తంగా ప్రచురించే నాటికి ఆయన స్ఫూర్తితో కృషి చేయాలన్న భావన వుంది. అలాగే కొశాంబి 115వ జయంతి సందర్భంగా ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ అమృతోత్సవం సందర్భంగా సైన్స్ ప్రచారకుడు, జిజ్ఞాసి అరవింద్ గుప్తా కొశాంబి కోసం రాసిన వ్యాసాన్ని గత ఏడాది నాన్న మొదటి వర్ధంతి స్మృతిలో ప్రత్నామ్యాయ చరిత్ర పరిశోధన సమాఖ్య, మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు) స్మారక వేదిక (పిఠాపురం) నుండి ప్రచురించడం జరిగింది.

ఇప్పుడు 'లోక్ సాహిత్య పరిషత్' హిందీలో ప్రచురించిన ఈ చిన్న పుస్తకాన్ని 'కొశాంబి స్టడీ సర్కిల్' తరఫున తీసుకురావడం సంతోషంగా వుంది .హడావుడిగా చేసిన ఈ అనువాదంలో అనవసరమనిపించిన కొన్నిచోట్ల మినహాయింపులు చేసాను. భౌగోళికంగా అపరిచితమయిన ప్రాదేశిక పేర్లు , తారీకులకు ప్రాధాన్యతను ఇవ్వలేదు. చత్తీస్గఢ్ యాసతో కూడిన పాటల్ని తర్జుమా చేయడం భావ్యం అనిపించలేదు కాన మినహాయించాను. ఇంకా తొందర్లో దొర్లిన తప్పులకు, భాషాదోషాలకూ పూర్తి భాధ్యత నాదే. ఆసక్తితోనూ, ఆశయదీక్షతోనూ చేసిన పనే కాని అనువాదం చేయడంలో నాకు ప్రత్యేకమైన తర్ఫీదు కానీ, నిపుణత గానీ లేదని పేర్కొంటూ ఇది చదివిన గుప్పెడు మంది యువజనులైనా అమరుల ఆశయాల స్ఫూర్తితో వారి బాటలో పయనించడానికి సంకల్పిస్తే అంతకుమించిన సార్ధకత ఈ స్మృతికి మరేది ఉండబోదని పేర్కొంటూ, సెలవు.

# ఈనాటి పీడితులకోసం వీర్ నారాయన్‌సింగ్ వీలునామా

**సో**నేఖాన్ అమరుడు వీర్ నారాయణ సింగ్ జన్మభూమి, కర్మభూమి మాత్రమే కాదు, సమకాలీనంగా విప్లవానికి తీర్థభూమి కూడా. అలాంటి సోనేఖాన్ వెళ్ళి నారాయణ సింగ్ కుంటుంబాన్ని కలుసుకునే భాధ్యత నాకు, సహదేవ్ సాహుకి సంస్థ అప్పగించింది. ఛత్తీస్గఢ్‌లో రాయపూర్ జిల్లాలోని బలోదా బజార్ మండలంలో సోనేఖాన్ వుంది. అడవుల మధ్యలో వున్న ఆదివాసీ గ్రామం అది. అనేక ఆదివాసి తెగల ప్రజలు అక్కడ నివశిస్తున్నారు. సోనేఖాన్ పంచాయితీలో భూసురి పాళీ, కసోందీ, మొహకమ్, బంగళా పాళీ మొదలగు గ్రామాలున్నాయి..

మేం రాయపూర్ నుంచి బలోదా బజార్ వెళ్లాం. అక్కడ నుండి కస్డోల్ వెళ్ళాలి. అందుకోసం విశాలమైన మహానది దాటాలి. అక్కడ వీర్ నారాయణ సింగ్ వ్యాపారస్థులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసాడు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా కూడా వీర్ నారాయణ సింగ్ కుటుంబం కడు పేదరికంలో వుంది. ఆ రోజు వీర్ నారాయణ సింగ్‌ను జైలులో పెట్టించిన వ్యాపారస్థుల వారసులు మాత్రం ఈ రోజు కోట్లకి పడగలెత్తారు. బీద రైతుల్ని ఈనాటికీ పీడిస్తున్నారు. నాటి బడా వ్యాపారస్తులు ఈ రోజు రాజకీయ నేతల అవతారమెత్తారు.

కస్‌డోలీ మీదుగానే సోనేఖాన్ వెళ్ళాలి. అలా మేం నదీనదులు, అడవులు దాటుకుంటూ ముందుకు వెళ్లాం. అలా వెళుతుండగా ఒకచోట ఎన్నో రాళ్ళగుట్టలు కనిపించాయి. ఎటుచూసిన రాళ్ళే రాళ్ళు. చిన్నవి, పెద్దవి, భారీవి ఎన్నో... వాటితోనే "వందల సంవత్సరాల క్రితం నేను బ్రిటీషు సామ్రాజ్యవాదుల పై తిరుగుబాటు చేశాను. ఈ రోజుకి వాళ్ళు ప్రజల్ని పీడిస్తున్నారు. కాబట్టి, మీరు కూడా సామ్రాజ్యవాదంపై తిరుగుబాటు చేయాలి. యువజనులారా, రండి, ఏం చూస్తున్నారలా దిక్కులు. విప్లవాన్ని విజయవంతం చేసే కర్తవ్యం మీదే. మర్చిపోకండి, కొత్త ప్రపంచాన్ని నిర్మించే బాధ్యత మీ మీదే వుంది" అని మా చెవుల్లో వీర్ నారాయణ సింగ్ చెబుతున్నట్లు అనిపించింది.

గిడోలా గ్రామం దాటి మేమలా ముందుకు సాగుతున్నాం. అక్కడున్న ప్రతి రాయి రప్పా, చెట్టు చేమ, మన్ను మసి, పశు పక్షి, గాలి నేలా అన్నీ ఒక్కసారిగా అమరుడు వీర్ నారాయణ సింగ్ ఉజ్వలమైన చరిత్రను చెప్పడానికి తహతహ లాడుతున్నట్లే తోచింది. అప్పుడు పొలాల్లో పని చేసుకుంటున్న రైతుల్ని అడిగాను. "మీరు నారాయణ సింగ్ గురించి విన్నారా?" అని. ఒక పేద రైతు బదులిచ్చాడు,

“మాకు తెలియదు” అంటూ.

అరే! దేశమంతా తెల్సిన మహానుభావుడు గురించి మీకు తెలీదే అని. అతడన్నాడు “ మీరు అడుగుతున్నది అమరుడు వీర నారాయణ సింగ్ గురించా,” అని. ఆ ప్రాంతం ప్రజలు నారాయణ సింగ్ను వీర్ నారాయణ సింగ్ అని పిలుస్తారు. తర్వాత ఎక్కడెక్కడ వీర్ నారాయణ సింగ్ కోసం అడిగానో అక్కడ ప్రతిచోట జనం మూగేసారు. వాళ్ళందరి కళ్ళలో నారాయణ సింగ్ వీరత్వం కోసం, త్యాగం కోసం చెప్పాలనే ఆతృతతో వున్నారు. చరిత్ర రచన వాళ్ళకి తెలియక పోవచ్చు గాని వీర నారాయణ సింగ్ వీరగాథని వాళ్ళంతా మననం చేసుకుంటూ పోతున్నట్లుగా కనిపించారు. సామ్రాజ్యవాదానికి, పీడనకు వ్యతిరేకంగా నిలిచిన వీర నారాయణ సింగ్ వీరగాథ వారి మనసుల్లో శాశ్వతంగా ముద్రించబడిందనే విషయం అద్వితీయమైన అద్భుత కాంతిలో మెరుస్తున్న వారి కళ్ళను చూస్తే తెలుస్తుంది.

అలా మొత్తానికి ఉదయం ఎనిమిదింటికి మేం సోనేఖాన్ చేరుకున్నాం. ఊర్లలో రైతులంతా అప్పటికే పొలానికి వెళ్ళిపోయారు. వున్న కొద్దిమందిని పిలిచి, మేము వీర్ నారాయణ సింగ్ గురించి సమాచారం తెలుసుకోవడానికి వచ్చామని చెప్పాం. మీరైనా చెప్పగలరా? అని అడిగాం. అందులో ఒకరు తప్పక చెబుతానని చెప్పారు. ఈలోపు జనం గుమికూడారు. పెద్ద గుంపు పోగయ్యారు. గ్రామస్థులు మమ్మల్ని వీర్ నారాయణ సింగ్ ఇల్లు వుండే చోటుకి తీసుకు వెళ్ళారు. అక్కడిప్పుడు జమిందారీ బంగళా ఏమి మిగల్లేదు. దాని స్థానంలో శిథిలాలు వున్నాయి. అక్కడున్న మహావృక్షాలు, వేప, చింత చెట్లు ఇప్పటికీ హుందాగా వీర్ నారాయణ సింగ్ వీరత్వాన్ని చెప్పడానికి సిద్ధపడ్డట్లు కనిపించాయి. వీర్ నారాయణ సింగ్ గది కూడా శిథిలమైపోయింది.

సోనేఖాన్ జిమిందార్ నివశించిన బంగళా పరిస్థితి ప్రస్తుతం ఇదే. దాదాపు 49 గ్రామాలకు జమిందారుగా వ్యవహరించిన వ్యక్తి నివాసం ఇదేనా? వాకబు చేయగా గ్రామస్థులు చెప్పినదేమిటంటే ఆయన పేరుకే జమిందారు కాని పీడకుడు కాదు. ప్రజల్ని వేధించుకు తినే భూస్వామి కాదు. అప్పుడు నేను గ్రామస్థులను కొన్ని ప్రశ్నలు అడిగాను. మీకు ఆయన ఆధీనములో వున్న గ్రామాల పేర్లు తెలుసా ? రాణిగారి పేరు తెలుసా ? గ్రామంలో వందేళ్ళ వ్యక్తి ఎవరైనా జీవించి వున్నారా? వారు చెప్పిన దాని ప్రకారం ఈ విషయాలన్నీ పాతవై పోయాయి. ఐతే పుల్వాడికి చెందిన జగపాల్ సింగ్ కొన్ని వివరాలు చెప్పగలరు. నేను ఇంకొన్ని ప్రశ్నలు అడిగాను. ఈ కొండల్ని మీరు ఏమని పిలుస్తారు. గ్రామం పశ్చిమాన చిన్న కొండ. దాన్ని పేరు

కురుపాట్ డొంగ్రీ. ఇక్కడే వీర్ నారాయణ సింగ్ కురుపాట్ దేవతని పూజించేవాడట. అక్కడ ప్రత్యేకత ఏమిటంటే సంవత్సరం మొత్తంలో ఎప్పుడూ నీళ్ళు లభిస్తాయట. కొండ మీద నీటి మడుగు వద్ద ఎంతో అందంగా, మనోహరంగా వుంది. గ్రామస్థులు చెప్పిన దాన్ని బట్టి ఈనాటికీ ప్రతి దసరాకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలంతా అక్కడికి వస్తారు. గ్రామాల పేర్లు కొన్ని 1) సోనేఖాన్ 2) మహాకమ్ 3) బగళా పాళీ 4) సార్ సడోల్ 5) సనేడి 6) బాసన్ పాళీ 7)నయాగావ్ 8) దేవనరాయి 9) మీర్ గోదా 10) పటియపాళీ 11) బికులి 12) బన్ పియా 13) చికలీ 14) సలిహమర్ 15) జాగిబాట్ 16) కోహకుడా 17) చన్ హర్ 18) భుసూరి పాలా 19) కోసడి 20) శుక్లాభాటా. వీర్ నారాయణ సింగ్ ఒక్క మాట కోసం ప్రాణలిచ్చే గ్రామాలే ఇవన్ని. స్వాతంత్రోద్యమ కాలంలో తిరుగుబాటు చేసిన గ్రామాలు ఇవే. ఇక్కడ బీద రైతుల రక్తమే ఏరులై పారింది. దోపిడీ పీడన లేనటువంటి సమసమాజ స్వప్నాన్ని ఇక్కడ ప్రజలు చూసారు. మరైతే ఆ రైతుల పోరాట స్వప్నం ఈరోజు ఫలించదని చెప్పగలమా? కొండ మీద ప్రతి దసరా పండగకు కురుపాట్ దేవతని పూజించే రైతులు అణిచివేత లేని ఒక వ్యవస్థ సాధన కోసం శపథం చేయగలరా? ఇలాంటి ప్రశ్నలన్నీ నా మనసులో మెదిలాయి.

కుర్పాట్ పర్వతం నుండి చూస్తే నాలుగు వైపులా కొండలతో వున్న సోనేఖాన్ గ్రామం కనిపిస్తుంది. దానికి పశ్చిమంగా బహేరాఖేల్ అనబడే అడవి, బిలాయిగడ్ అడవి, లామి డోగ్రి, సరాయిపాళీ డోగ్రీ, ఖాటాకలోయ డోగ్రి ఇంకా అనేక చిన్న చిన్న కొండలు గుట్టలు వుంటాయి.

వీర్ నారాయణ సింగ్ కురుపాట్ కొండపై ఎక్కువ సమయం గడిపేవాడు. తన గుర్రమెక్కి ప్రతి గ్రామానికి వెళుతూ మంచిచెడ్డలు కనుక్కుంటూ ఉండేవాడు. సమస్యలు విని తన శక్తి కొలది సాయం చేస్తుండేవాడు. ఈనాటికీ గుర్రం మీద స్వారీ చేస్తున్నటువంటి వీర్ నారాయణ సింగ్ తమకు కనబడుతూ వుంటాడని అక్కడి ప్రజలు చెబుతుంటారు. అలా అన్నప్పుడు నేను చుట్టూ మూగిన ప్రజల్ని అడిగాను: మీలో ఎవరైనా గుర్రంపై స్వారీ చేస్తూ వెళుతున్న వీర్ నారాయణ సింగ్ ను చూసారా? అని "లేదు మేమైతే చూడలేదు" అన్నారు. ఆ ప్రాంతంలో ఆయన ఇంకా సజీవుడే అనే నమ్మకం మాత్రం వుంది.

వీర్ నారాయణ సింగ్ విచిత్రమైన వ్యక్తి. ఆయన దగ్గరికి వచ్చి ఎవరైనా ఏడుస్తూ ఫలానా వ్యాపారి నన్ను మోసం చేసాడంటే వాళ్ళని శిక్షించేవాడట. అదే

నేను ఫలానా అధికారిని కొట్టి పరిగెత్తించాను, ఫలానా వ్యాపారి భరతం పట్టానంటే మాత్రం వార్ని తగిన విధంగా సత్కరించి బహుమతులు ఇచ్చి పంపేవాడట. ఈనాటికీ దసరా రోజు వీర్ నారాయణ సింగ్ గొంతు వినిపిస్తూదంటారు. ఆయన కోసం ఎన్నో వదంతులు ప్రచారంలో వున్నాయి.

కురుపాట్ కొండ మించి చూస్తే గ్రామం అందమైన చిత్రంలా కనిపిస్తుంది. రాజాసాగర్, రాణిసాగర్ అనే రెండు నదులుంటాయి. అదీకాక దక్షిణాన నందసాగర్ అనే మరో చెరువు వుంది. దీన్ని వీర్ నారాయణ సింగ్ తవ్వించాడు. ఇంకా ఈ చెరువు ఒడ్డున నాడు ఆయన చేతుల మీదుగా స్వయంగా నాటిన మామిడి, వేప మొక్కలు నేడు మహావృక్షాలై మనకి కనిపిస్తాయి. ఆయన అందులోనే స్నానం చేసేవారట.

ఈరోజు అక్కడ పట్టణం ఏర్పడింది. అయితే గతంలో వున్న పాతపట్నం అది కాదు. ఆంగ్లేయులు తిరుగుబాటు చేసినప్పుడు వాళ్ళు మొదట ఈ పట్నంపైనే దాడి చేసారు. అప్పుడు వీర్ నారాయణ సింగ్ చూపిన ధీరత్వం గురించి జరిగిన చారిత్రక పోరాటం గురించి చరిత్రకారులు వివక్షతా పూరితంగా వ్యవహరించారు. గాని పీడిత ప్రజల నోళ్ళలో ఆ చరిత్ర ప్రతి తరానికి శతాబ్దాలుగా అందుతూనే వుంది. ఆంగ్లేయులు పట్టణంలోని ఆ బస్తీకి అన్నివైపుల నిప్పు పెట్టారు. ప్రాణభయంతో పరిగెడుతున్న పిల్లల్ని కూడా పట్టుకుని ఆ మంటల్లో పడేసారు. ఎన్నో అత్యాచారాలు జరిపారు. విచక్షణారహితంగా కాల్పులు జరిపి అసంఖ్యాక మందిని కాల్చి పారేసారు. పట్టణం మొత్తం ఖాళీ అయిపోయింది. ప్రాణాలు దక్కించుకున్నవారు అడవులు, కొండల్లోకి చెరోదిక్కుగా పారిపోయారు. గ్రామస్థులు ఆ క్రూరత్వాన్ని గుర్తుంచుకోరు. వారు వీర్ నారాయణ సింగ్ సంఘర్షణ మాత్రమే గుర్తుంచుకుని గర్విస్తారు. ప్రజల కన్నీళ్ళు ఇన్ని సంవత్సరాల్లో ఇంకిపోయాయి. తరతరాలుగా వారిలోనే గూడు కట్టుకుని దుఃఖంగా కోపంగా మిగిలిపోయాయి. మళ్ళీ అవకాశం వస్తుంది. యుద్ధం జరుగుతుంది. వీర్ నారాయణ సింగ్ ఉద్భవిస్తాడు. ఆయన్ని విజయం వరిస్తుంది. పీడన, అత్యాచారాలు, అసమానతలు లేని నూతన రాజ్యం వస్తుంది. ఈరోజు ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం, ఆంగ్లేయుల సామ్రాజ్యవాదం లేవు. కాని ప్రజల్ని పీడించే షావుకార్లు, వ్యాపార వర్గ పెట్టుబడిదారులు ఆంగ్లేయుల స్థానాన్ని ఆక్రమించారు. దేశీ రాజకీయ పార్టీలే అధికారం చేబట్టి ప్రజల్ని దోచుకుంటున్నారు. ఈ పాలక వర్గ కబ్జాదారులకు వీర్ నారాయణ సింగ్ పేరు పలకడం కూడా ఇష్టం లేదు. కాబట్టి ఇంతకాలం దాన్ని తొక్కిపెట్టారు. వీళ్ళ పీడనపై ఆక్రోశంతో గ్రామస్థులు వీర్ నారాయణ సింగ్‌ని మళ్ళీ

జ్ఞప్తికి తెచ్చుకున్నారు. బ్రాహ్మణాధిక్యతకి వ్యతిరేకంగా స్థానిక దదరియా అనబడే జానపద గీతాన్ని అందుకుని :

శనగ చేనులో పిండి ఎగిరి పోతుంది

సోనేఖాన్లో బ్రాహ్మలు ఎగిరిపోతారు !

అలా పాడుతున్న గాయకుల్ని బ్రాహ్మణ కుటుంబీకులు అడ్డుకుని బెదిరింపులు చేశారు. నారాయణ సింగ్‌కి సంబంధించిన పాటలు పాడకుండా శాసించారు. ఆయన పోరాటానికి సంబంధించిన గాథల్ని ఎవ్వరూ చెప్పకూడదన్నారు. అయినప్పటికీ వీర్ నారాయణ సింగ్ అసమాన వీరత్వాన్ని అడ్డుకోలేకపోయారు. పీడితుల తిరుగుబాటు ఎక్కడో అక్కడ అలా గర్జిస్తూనే వుంది.

పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరీ వసంత మేఘం అలాగే గర్జించింది. సోనేఖాన్ దగ్గరలో జంజగీర్ ఆదివాసులు, దళితుల క్షేత్రం. అప్పుడిక్కడ షావుకార్లు వణికిపోయారు. ఇక్కడున్న నీటి సమస్య కోసం ప్రభుత్వంతో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. నారాయణ సింగ్ గ్రామం కూడా అందుకు మినహాయింపు కాదు. ప్రభుత్వం కేటాయించిన కోట్ల రూపాయిల ప్రణాళిక పనులు ఇంకా అక్కడ పూర్తికాలేదు. కాని వాటి పేరు చెప్పి ప్రజల సొమ్ము మాత్రం అక్కడున్న అగ్రకుల అధికారి కాజేశాడు.

వీర్ నారాయణ సింగ్ అవసరం వుందా? అని గ్రామస్థులను అడిగాను. ఆ ప్రశ్నతో ప్రజల కళ్ళు కొత్త వెలుగుతో మెరిసాయి. వాళ్ళు నిలబడి చెప్పారు, 'ఒకరోజు మేమంతా కూడా వీర్ నారాయణ సింగ్‌లం అవుతాం.' అనే వారి నినాదాలు అడవంతా ప్రతిధ్వనించాయి.

"మిశ్రాలకి ఏం గతి పడుతుంది

పాలకులకి ఏం గతి పడుతుంది

వీర్ నారాయణ సింగ్ వస్తాడు

వీర్ నారాయణ సింగ్ వస్తాడు"

నారాయణ సింగ్ పూర్వీకులు గోండు తెగవారు. వారు సారంగడ్ జమిందారీ వంశస్తులంటారు. యుద్ధ భయంతో వారు బిజ్బార్ జాతిలోకి మారారు. అప్పట్లో ఢిల్లీలో పఠాన్ల రాజ్యం వుండేది. ఇప్పటి మహారాష్ట్రలోని చందా జిల్లా మొదలుకొని సంబల్ పూర్ కల్హాండి వరకు గొండ్వానా పరిధిలోకి వచ్చేవి. జబల్‌పూర్ మండల మొదలైన రాజ కుటుంబాలు గోండు వంశాలే. పఠాన్ల సైన్యం చందా జిల్లాలోని

కొన్ని గోండు రాజ్యాలపై దాడి చేసారు. కొందరు గోండు రాజులు ఇస్లాంలోకి మారిపోయారు. తర్వాత వారి రాజ్యాలు తిరిగి చేతిలోనికి వచ్చాయి. ముస్లింలుగా మారిన గోండు రాజులతో ఇతర గొండ్వానా రాజులకి శతృత్వం వుండేది. మతం మారిన రాజులు ఎన్నో దుష్కృత్యాల్ని చేసారు. వారు 'గోండ్ మారు' పేరుతో విఖ్యాతి నొందారు.

సారంగడ్‌కి చెందిన విషాహి ఠాకూర్ సోనేఖాన్‌లోని వీర్ నారాయణ సింగ్ జమిందారీ వంశానికి పూర్వీకుడంటారు. నారాయణ సింగ్ తండ్రి రామ్ రాయ్. నారాయణ సింగ్ ఆధీనంలో 70 గ్రామాలు వుండేవి. అవి 1) ఉపరానే 2) తిలాయి పాళీ 3) దల్ దలే 4) గిడోలా 5) కాశీ పాటర్ 6) కేసర 7) మహారాజి 8)మహకోని 9) నరద 10)గోగ్రా 11) జకడి 12) అంజుని 13) సుఖాపాళీ 14) హరధీ 15) మడల 16) టెందుద హర 17) గడాడి 18)సహర్ జోర్ 19) కాశీవహర్ 20) ఘర్ జర 21) బారాద్వార్ 22) బారానా విహ్ 23) సోనాడి 24) పచ్ పడి 25) వహిమేదా 26) దోరి 27) కురుబాతా 28) తనాయి 29)తివాళి 30)కేరిపూవా 31) పరస్ కోల్ 32) కోదోమాల్ 33) ఘనేరా 34) పురాయి పాళీ 35 ) దేవ్ గడ్ 36) వేం ధూచువా 37)జమేగా 38) దేవ్ పూర్ 39) బడా దేవ్ పూర్ 40) నవాగావ్ 41) సఫలాపారా 42) కారి 43) నరి 44) సరాయీ పాల్ 45) వఘమలి 46) సిరిమాల్ 47) చోటా మలువా 48) బడి మలువా 49) చీతా పదరియా వీటి ముందు ఉల్లేఖించిన గ్రామాలు కూడా ఆయన స్వాధీనంలో వుండేవి.

ఆంగ్లేయులు ఇక్కడి రాజుల్ని పూర్తిగా నమ్మేవారు కాదు. ఆ కారణంగా ఇరువురికీ శత్రుత్వం వుండేది. నయా సామ్రాజ్యవాదం మొదలైనప్పుడు ఇక్కడ షావుకారీ వర్గాలు మెల్లగా బడా వ్యాపారస్తులుగా తర్వాత పెట్టుబడిదారీ వర్గాలుగా మారాయి. కరువు కాలంలో ఈ షావుకార్లు ప్రజల్ని ప్రతి గ్రామంలోనూ పీడించుకు తిన్నారు. అగ్రకుల పెత్తందార్లు, బ్రాహ్మణ మిశ్రాలు, వ్యాపారులు గ్రామంలోని భూములను కూడా ఆక్రమించారు.

అలాంటి సమయంలో భయంకరమైన కరువు వచ్చింది. అప్పుడు కమిషనర్లుగా బ్రిటీషు అధికారులైన ఇలియట్, స్మిత్ వున్నారు. బస్తాల కొద్ది తిండి గింజలు షావుకార్ల వద్ద ములుగుతున్నాయి. అయినా వారు బీదాబిక్కిలకి ఎరువిచ్చేవారు కాదు. ఆఖరికి నారాయణ సింగ్ కల్పించుకుని చెప్పినప్పటికీ లాభం లేకపోయింది. ఇక నారాయణ సింగ్ పోరాటానికి పిలుపునిచ్చాడు. అంతే ఆ నినాదం ఎంత త్వరగా వ్యాపించిందంటే,

అనేక గ్రామాల ప్రజలు తండోపతండాలుగా సోనేఖాన్ వైపు కదిలారు. నారాయణ సింగ్ కురుపాట్ కొండ మీద డేరా వేసుకుని వున్నాడు. అక్కడి సెలయేటి నీరు తాగి షావుకార్ల అన్యాయాన్ని సహించమని ప్రతిజ్ఞ చేసారు. ఊర్లోకి వెళ్ళి ప్రజల సమక్షంలో గొడౌన్లో వున్న తిండి గింజల్ని స్వాధీనం చేసుకుని అక్కడ ప్రజలందరికీ సమంగా పంచారు. చత్తీస్గఢ్ చరిత్రలో అటువంటి మహత్తరమైన సంఘటన అప్పటికి జరగలేదు.

ప్రజల కోసం ప్రజలే చేసిన స్వతంత్ర సంగ్రామం అది. ప్రజాపోరాటం అది. దానికి నేతృత్వం వహించింది ఆదివాసి నేత వీర్ నారాయణ సింగ్. ఈ సంఘటన గురించి సమాచారాన్ని నారాయణ సింగ్ ఆంగ్లేయులకు పంపాడు. వ్యాపారస్తులు కూడా డిప్యూటీ కమిషనర్‌కి ఫిర్యాదు చేసారు.

ఆ ఫిర్యాదు అందుకున్న కమిషనర్ పోలీస్ దళంతో అరెస్టు వారెంట్‌ను నారాయణ సింగ్‌కు పంపాడు. నారాయణ సింగ్‌ని రాయపూర్ తీసుకెళ్లారు. 1857 దేశంలోని ప్రజ, సిపాయిలు స్వాతంత్ర్య విప్లవ శంఖారావం పూరించారు. బంగాల్‌లోని బేరాక్ పూర్‌లో ఆ నిప్పు రాజుకుంది. ఝాన్సీరాణి, తంతియాతోపే, నానా సాహెబ్ తదితరులు సిపాయిల సంగ్రామానికి సారధ్యం వహించారు. రాయపూర్‌లోని జైల్లో వున్న వీర్ నారాయణ సింగ్ మనసు కూడా ఉద్యమంలో భాగస్వామ్యం కోసం ఆరాటపడుతూ వుంది. బ్రిటీషు సామ్రాజ్యవాదుల్ని దేశం నుండి తరిమి కొట్టాలనే కోరికతో అవకాశం చూసుకుని ఆయన జైలు నుంచి తప్పించుకుని మళ్ళీ సోనేఖాన్ వచ్చాడు. సోనేఖాన్లో ప్రవహించే నదీజలాలలో బంగారు అణువులు దొరికేవనే కారణంతో సోనేఖాన్‌కి ఆ పేరు స్థిరపడింది. (సోనా అంటే బంగారం). వీర్ నారాయణ సింగ్ ఊహించిన సోనేఖాన్ ఎంతటి స్వర్గతుల్యమో కదా! మేమలా ఏరుదాటి గజపాల్ సింగ్ డేరా వద్దకి చేరాం.

తిండిగింజలు పంచాడనే నెపంతో బంధించిన నారాయణ సింగ్ ఎప్పుడైతే తప్పించుకుని సోనేఖాన్ చేరాడో, అప్పుడిక గ్రామగ్రామాన విప్లవ నగారా మోగింది. ఆయన్ని చూడ్డానికని గ్రామాలన్నీ తరలివచ్చాయి. ప్రజలందరు ఎవరో ఆదేశించినట్లు సంఘటితంగా కదిలారు.

సమావేశం జరిగింది. నారాయణ సింగ్ నేతృత్వంలో గ్రామస్థులంతా సంగ్రామానికి సంసిద్ధమయ్యారు. చారిత్రక సిపాయిల తిరుగుబాటులో ఛత్తీస్గఢ్ కూడా భాగమై కలిసింది. దేశవిముక్తి కోసం రక్తాన్ని అర్పించే అద్భుతమైన చరిత్రకు అంకురార్పణ జరిగింది. ఆంగ్లేయులు కూడా మౌనంగా కూర్చోలేదు. వాళ్ళ తయారీలో

వాళ్ళున్నారు. ఇంతవరకు చెప్పి గజపాల్ సింగ్ ఊపిరి తీసుకోవడానికి ఆగాడు. అంతలో నారాయణ సింగ్ కొడుకు మనవడు ముచ్చా టీ తీసుకొచ్చాడు. దాదాపు 60 ఏళ్లవాడు. అతడు విరిగిపోయిన ఒక చెక్క పెట్టె తెచ్చి ఏవో కాగితాలు వున్నాయని చూపించాడు. చెదలు పట్టిన ఉత్తరాలు కొన్ని చూసాం. ఇంతలో గజపాల్ సింగ్ పొడవైన తుపాకి చూపించాడు. దాంతోనే నారాయణ సింగ్ బ్రిటీషువారితో పోరాడాడు. ఇంకేం తుపాకీలు లేవా అని నేను ప్రశ్నించాను. కొన్ని గ్రామాల్లో ఉండొచ్చని చెప్పాడు. కొన్ని పాత తుపాకీల్ని ఇరుసులుగా కూడా వాడారట. అప్పుడు సహదేవ్ అనే గ్రామస్తుడు పోరాటం కోసం చెప్పమన్నాడు. గ్రామస్థుల కళ్ళు మళ్ళీ మెరిసాయి. అప్పుడో వ్యక్తి నిలబడి చెప్పాడు. విభీషణుడు లేకుండా రావణుడిని గెలవడం సాధ్యం కాదన్న చందంగా కొందరు జమిందార్లు నారాయణ సింగ్‌ను మోసం చేసారు. కొద్ది మంది రైతులు, సంబల్‌పూర్కి చెందిన విప్లవకారుడు సురేంద్ర సాయి మినహా నారాయణ సింగ్ బావతో సహా జమీందార్లంతా బ్రిటీషు వారికే మద్దతు ఇచ్చారు.

నారాయణ సింగ్ బంధువైనప్పటికి దేవరీ జమిందారు ఆంగ్లేయుల వైపే వున్నాడు. బిలాస్ పూర్ జమీందారయితే బ్రిటీషు వారికి మద్దతుగా సైన్యాన్ని పంపించాడు. బాటాగావ్, బిలాయిగడ్ జమిందార్లు కూడా అనేక విధాలుగా ఆంగ్లేయులకి సహకరించారు. సహజంగానే నారాయణ సింగ్ దగ్గరున్న రైతులు యుద్ధంలో సంశిక్షుతులు కారు. పైగా ఇలాంటి ద్రోహాలవల్ల కూడా యుద్ధంలో ఓడిపోవలసి వచ్చింది. ఒరిస్సాకి చెందిన విప్లవకారుడు సురేంద్ర కొడుకు గోవింద్ సింగ్ ఈ మోసాలకి, కుట్రలకు గట్టిగా బదులిచ్చాడు. దేవరీ రాజు తలను ఒక్క వేటుతో వేరు చేసాడు. అప్పుడు నేను అడిగాను. 'నారాయణ సింగ్‌తో కస్ డోల్ బ్రాహ్మణులకు ఏమైనా వ్యక్తిగత వైరం వుందా ?' అని అప్పుడు గజ్ పాల్ అన్నాడు, ఏముందో ఎవరికి తెలుసు ? కాని తిండిగింజలు కోసం జరిగిన పోరాటంలో వీర్ నారాయణ సింగ్ రైతులకి అండగా నిలిచాడు. స్వాతంత్ర్య సమరంలో బ్రిటీషు అధికారం నిర్మూలించడానికి పోరాటం చేసాడు. అప్పుడే గ్రామ షావుకార్లు, బ్రాహ్మణుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా వారిపై తిరగబడ్డాడు. ఆ పోరాటంలో ఖరోద్ గ్రామంలో ఒక గర్భవతైన మహిళ, ఆమె కొడుకు మాత్రమే ప్రాణాలతో మిగిలారు.

సహదేవ్ మళ్ళి అడిగాడు 'కురుపాట్ అంతిమ పోరాటంలో ఏమైంది' బ్రిటీషు వారితో పోరాడుతుండగా నారాయణ సింగ్ దగ్గర తూటాలు అయిపోయాయి. ఆధునిక ఆయుధాలు ముందు సాంప్రదాయ ఆయుధాలు నిలవలేదు. నారాయణ సింగ్

పట్టుబడ్డాడు. అతడుతో పాటు గుర్రాన్ని మరొక అనుచరుడ్ని పట్టుకొని బంధించి రాయపూర్ తీసుకుపోయారు. సోనేఖాన్ గ్రామాన్ని మొత్తం నిర్జీవంగా మార్చేసారు. నారాయణ సింగ్ కుటుంబ సభ్యులు, గోవింద్ సింగ్ అత్తవారి గ్రామం ఒరిస్సాలోని పద్మపూర్ వెళ్ళి పోయారు. ఇంకొంతమంది అడవుల్లోకి పారిపోయారు. ఇదంతా వింటూ మేము చాలా ముందుకు పోయాం.

అలా ముందుకు నడుస్తూ నేను గజపాల్ సింగ్ను అడిగాను,"సోనేఖాన్ని ఎప్పట్నుంచి ఆ పేరుతో పిలుస్తున్నారు" అని. దానికాయన జవాబు చెబుతూ 'ఇది కూడా చాలా పాత విషయం. మా వంశానికి సంబంధించిన కాగితాన్ని చూపిస్తాను. దాంట్లో సోనేఖాన్ పాతపేరు సింహఘడ్ అనుంది. సింహఘడ్ నుండి సింహఖాన్ తర్వాత సోనేఖాన్గా మారింది. ఇంకా ఆ కాగితాల్లో వున్న ఇతర విషయాలన్ని గూర్చి చెప్పాడు.

రాత్రింబవళ్ళు ప్రయాణించీ మేం తిరిగి రాయపూర్ చేరే సరికి సూర్యుడు ఆకాశాన్ని ముద్దాడుతున్నాడు. ఆ సూర్యకిరణాలు జయస్తంబ్ చౌక్లోని స్తంభం మీద పడుతున్నాయి. ఈ జయ స్తంభం వద్దనే వీర్ నారాయణ సింగ్ రక్తం పారింది. ఈరోజు అక్కడ పెద్ద రోడ్డు వున్నది. లక్షాలాది మంది అటువైపు వెళుతున్నారు. వీళ్ళకెవరికైనా దేశవిముక్తి కోసం ప్రాణత్యాగం చేసిన వీర్ నారాయణ సింగ్ మార్గంలో వెళ్ళే వుద్దేశ్యం వుందా? ఆ అమరుడి దారిన వెళ్ళే ధైర్యముందా?

*** *** ***

## ముగింపు

నేటికి వందల సంవత్సరాల క్రితం సంగతి. 1856 సంవత్సరం. చత్తీస్గఢ్లో భయంకరమైన కరువొచ్చింది. వడ్డీ వ్యాపారులు, షావుకారులు, రైతుల నుండి తిండి గింజలన్ని లాక్కున్నారు. ఎటువైపు చూసినా హాహాకారాలు చుట్టూముట్టాయి. అప్పుడు ఆదివాసులను, రైతుల్ని వీర్ నారాయణ సింగ్ సంఘటితం చేసాడు. వడ్డీ వ్యాపారుల వద్ద నుండి తిండిగింజలు తీసుకొచ్చి ప్రజలందరికీ సమానంగా పంచాడు. వ్యాపారస్థుల ప్రోద్భలంతో బ్రిటీషు ప్రభుత్వం వీర్ నారాయణ సింగ్ని రాయపూర్ జైల్లో పెట్టింది. సరిగ్గా సంవత్సరం తర్వాత దేశం మొత్తం 1857 స్వాతంత్ర్య సంగ్రామంలో ఉవ్వెత్తున ఎగసిపడుతుండగా నారాయణ సింగ్ జైలు నుంచి ఒక్క తుపాకి శబ్దం వినగానే తప్పించుకొచ్చి సోనేఖాన్లో సమర శంఖారావం పూరించాడు. అనేక గ్రామాల్లోని రైతుకూలీలు, ఆదివాసులు ఆయనతో వచ్చి చేరారు. కాని వడ్డీ వ్యాపారులు, బ్రాహ్మణ

బనియాలు కుట్ర పన్ని పోరాటాన్ని చీల్చారు. దేశవిముక్తి కోసం, దేశ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం అవిశ్రాంతంగా పోరాడిన వీర్ నారాయణ సింగ్ వీర మరణాన్ని పొందాడు. అశేషమైన ప్రజాబాహుళ్యం కోసం అమరుడయ్యాడు.

బ్రిటీషు ప్రభుత్వం వీర్ నారాయణ సింగ్‌ని దొంగగా, దోపిడీదారుడిగా పేర్కొని ముద్ర వేసింది. 1979 వరకు ఆయన పేరు చీకట్లో వుంది. శంకర్ గుహ నియోగి నేతృత్వంలో చత్తీస్గఢ్ మైన్స్ శ్రామిక సంఘం ఆధ్వర్యంలో వీర్ నారాయణ సింగ్ వీరత్వాన్ని, అమరత్వాన్ని వెలుగులోకి తీసుకురావడం జరిగింది. ఆయన స్ఫూర్తితో పీడిత ప్రజలు చైతన్యంవంతులు కావాలనే ఆశయంతో వీర్ నారాయణ సింగ్ త్యాగాన్ని వెలుగులోకి తేవడం జరిగింది.

డిసెంబర్ 19 ,1857న వీర్ నారాయణ సింగ్ కాల్చి చంపబడి అశేష ప్రజానీకానికి తిరుగులేని ఆరాధ్యుడయ్యాడు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాల్లో ఆంగ్లేయులు భారత్‌ను వదలి వెళ్ళిపోయారు. కాని ఏ స్వాతంత్ర్యంకోసం నారాయణ సింగ్ వంటి లక్షాలాది వీరులు బలిదానం చేసారో ఆ స్వాతంత్ర్య ఫలాలు మాత్రం ప్రజలకు దక్కలేదు.

కోట్ల విలువైన సహజ వనరులు గల పేద దేశం. డబ్బైశాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన బతుకుతున్నారు. వాళ్ళెవ్వరికీ కూడా తిండి, బట్ట, నివాసం, విద్య, ఆరోగ్యం లేవు. 50 కోట్లకు పై బడిన ప్రజలు నిరక్షరాస్యతతో అజ్ఞానంలో మగ్గుతున్నారు. ఆ జనాలు ఎప్పటికీ ప్రశ్నించకుండా వార్ని మతమనే అంధకారంలో ముంచెత్తుత్తున్నారు. కులమతాల పేరుతో విభజించి పాలిస్తూ విద్వేషాలను పెంచి పోషిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా కూడా ఈ దేశం స్వదేశీ–విదేశీ దోపిడీదారులకు నిలయంగా మారింది. టాటా, బిర్లా, గోయంకా, రిలయన్స్, మోదీ వంటి స్వదేశీలతో పాటు అమెరికా, జర్మనీ, జపాన్ వంటి దేశాల పెట్టుబడిదార్లు మాత్రమే అభివృద్ధి పేరు చెప్పి బాగుపడ్డారు. దేశం రోజురోజుకు కోట్లాది రూపాయిలు అప్పు చేస్తోంది. ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలే అప్రకటితంగా మన దేశాన్ని పాలిస్తున్నాయి. అందుకే ఎప్పటికప్పుడు నిత్యావసరాలు, ఎరువులు, గ్యాస్, పెట్రోలు, డీజల్, విద్యుత్ ధరలు పెరుగుతున్నాయి. దేశం ప్రైవేట్ పరం అవుతుంది. కార్పోరేట్ పరం అవుతుంది. నిరుద్యోగం పెరిగిపోతుంది.

ఏ ప్రాంతంలోని స్వదేశీ, విదేశీ పీడకుల్ని, దోపిడీదారుల్ని వీర్ నారాయణ సింగ్ తరిమికొట్టాడో ఈ రోజు ఆ చత్తీస్గఢ్ ప్రాంతం స్థితి మరీ దయనీయంగా

వుంది. అపారమైన ఖనిజ సంపద, ప్రకృతి సహజ వనరులు, అడవులు, జలవనరులతో అలరారే చత్తీస్గఢ్ వైపు పెట్టుబడిదారులు ఆశగానే చూస్తున్నారు. భూమి, నీరు, అడవులపై ఇక్కడి ప్రజలకి హక్కులేదు. 'ధాన్యపు గిన్నె' గా పేరొందిన చత్తీస్గఢ్ సగకాలం కరువునే ఎదురుకుంటున్నది. ఒకవైపు ఇక్కడి నదులు, సహజ వనరుల్ని వాడుకుని భిలాయి, కోర్బా వంటి ప్రాంతాల్లోని పెద్దపెద్ద పరిశ్రమలు నడుస్తుంటే మరోవైపు ఆకలి, నిరుద్యోగంతో తాళలేక లక్షలాది చత్తీస్గఢ్ ప్రజలు పొట్టపట్టుకుని వలస పోతున్నారు. పెద్దపెద్ద కార్పోరేట్ కంపెనీలు బిలాయి ఉక్కు పరిశ్రమ, సింప్లెక్స్, బి,ఇ.సి.బి.కె వంటి సంస్థల వల్ల ప్రజలకి ఏమీ లాభం లేదు. ఉన్న కార్మికుల్ని కూడా తీసేసి ఆధునిక యంత్రాల ద్వారా అంతా నడిపించే పక్రియ చేబడుతున్నారు. నెలకొల్పబడే కొత్త పరిశ్రమల్లో కూడా అతి కొద్ది మందే ఉపాధి పొందుతున్నారు.


గడిచిన కొన్ని సంవత్సరాలుగా చత్తీస్గఢ్లోని శ్రామిక జనం నియోగి నేతృత్వంలో వీర్ నారాయణ సింగ్ మార్గంలో పోరాడుతున్నారు. భూస్వామ్య పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. చత్తీస్గఢ్ విముక్తి కోసం రక్తం చిందిస్తున్నారు. దల్లి రాజ్హరాలో మొదలైన ఈ పోరాటం అనేక రూపాల్లో కొనసాగుతోంది. భిలాయిలో జరిగిన పోరాటంలో స్వయంగా నియోగి ప్రాణాలర్పించి అమరుడయ్యాడు.

వీర్నారాయణ సింగ్ ఏ దుర్మార్గాలపై పోరాటం చేసి అమరుడయ్యాడో ఆయా దుర్మార్గాలు ఈనాటికీ మన దేశంలో, మన ప్రాంతంలో ఇంకా కొనసాగుతున్నాయి. కాబట్టి ఈ రోజుకి వీర్నారయణ్ సింగ్ అవసరం వుంది. ఆదివాసీలు, రైతులు, పీడితులు, అణగారిన ప్రజలు ఒక్కతాటిన సంఘటితంగా నడిచినప్పుడే వీర్ నారాయణ సింగ్ స్వప్నం సాకారం అవుతుంది. అన్యాయాలకి, అక్రమాలకి, ఆధిపత్యాలకి వ్యతిరేకంగా సమిష్టిగా దేశ ప్రేమికులంతా కదలినప్పుడే నారాయణ సింగ్ కల నెరవేరుతుంది. అప్పుడే దోపిడీ రహిత, పీడన రహిత చత్తీస్గఢ్ రాష్ట్రం సాధ్యపడుతుంది.

వీర్నారాయణ సింగ్ వీరత్వాన్ని, విప్లవ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్ళడమే ముఖ్యోద్దేశంగా "లోక్ సాహిత్య పరిషత్', నియోగి రాసిన ఈనాటి పీడితుల కోసం, వీర్ నారాయణ సింగ్ వీలునామా" అనే రచన ప్రచురిస్తోంది. అణగారిన ప్రజానీకానికి ఈ అక్షరాలు ప్రేరణ నిస్తాయనేదే మా ఆకాంక్ష.

డిసెంబర్ 19, 1992 **ప్రకాశకులు**

## అనుబంధ వ్యాసాలు



# సత్యాన్ని సాయుధం చేసినవాడు శంకర్ గుహ నియోగి !!

డబ్బై ఎనిమిదేళ్ళ క్రితం ఫిబ్రవరి14న పశ్చిమ బెంగాల్ లోని జల్పాయిగురిలో పుట్టిన అతడు బతికుంటే భారతదేశపు కార్మిక ఉద్యమాలు వేరుగా ఉండేవంటారు, అతన్ని సంపూర్ణంగా బతకనిచ్చుంటే ప్రజా ఉద్యమాల పంథా తీరే మార్చే వాడంటారు!

ప్రఖ్యాత చరిత్రకారుడు రామచంద్ర గుహ అభిప్రాయం ప్రకారం "మార్క్స్, గాంధీ, అంబేద్కర్" భావజాలాల అరుదైన కలయిక నియోగి. అందుకే అందరు ఉద్యమకారుల్లా పోరాటం కోసం మాత్రమే కాకుండా, నిర్మాణం కోసం కూడా నినదించాడు!

"సంఘర్ష్ ఔర్ నిర్మాణ్" అనేది భారత ప్రజా ఉద్యమాలకి అతడు నిర్దేశించిన అద్భుతమైన సూత్రం."లాల్, నీల్, హరా ఏకతా" అనేది వామపక్ష దళితబహుజన ఆదివాసీ పర్యావరణ ఉద్యమాల ఐక్యత కోసం అతడు నిర్ణయించిన మార్గం!

ఆర్థిక రాజకీయాల ఒరవడిలో సాగుతున్న ట్రేడ్ యూనియన్ శ్రేణులకి సామాజిక చైతన్యంతో కూడిన నూతన మార్గాన్ని పరిచయం చేసిన అనితరసాధ్యమైన నేత నియోగి!

మద్యపాన వ్యతిరేక ఉద్యమం చేపట్టి అక్షరాలా ఐదు వేలకి పైబడిన కార్మిక కుటుంబాల్లో వెలుగు నింపాడు. కుల నిర్మూలన, మతసామరస్యం, మార్క్సిస్ట్ తత్వశాస్త్రాల్ని నిత్యజీవితంలో అనుసంధానించి చూపాడు. ఒక రాష్ట్ర రాజకీయాల్ని శాసించగలిగే శక్తి ఉండి కూడా అతి సామాన్యంగా బతికాడు!

సరిగ్గా 30 ఏళ్ళ క్రితం 1991లో దుర్మార్గంగా జరిగిన అతడి హత్య వ్యక్తిగా కాదు, భారతీయ కార్మికోద్యమ చరిత్రని తిరుగులేని స్పష్టతతో మలుపు తిప్పిన ఒక శక్తిగా దేశంలోని కార్పొరేట్ దోపిడిదారులకు అతడంటే ఎంత భయమో నిరూపించింది!

అనిల్ సద్ గోపాల్, భరత్ డోగ్రా వంటి సామాజిక కార్యకర్తలు అతి కొద్దిమంది మాత్రమే నియోగి గురించి హిందీలో పుస్తకాలు ప్రచురించారు. ఈ రోజు ఆయన గురించి,

అలాగే నియోగి ప్రభావంతో నడుస్తున్న 'షహీద్ స్కూల్', 'షహీద్ హాస్పిటల్' గురించి ఆయన అవలంబించిన మార్గం గురించి తెలియాల్సిన, చర్చ జరగాల్సిన అవసరం ఎప్పటికంటే ఎక్కువ ఉందనేది నా అభిప్రాయం!

పెత్తందారులూ, పెట్టుబడిదారులు చంపుతారని తెలిసి కూడా ప్రాణాల్ని లెక్కచేయకుండా న్యాయం కోసం బుల్లెట్లకి ఎదురు నిలిచిన నియోగి స్ఫూర్తిని కులతత్వం, మతోన్మాదం, రాజకీయ జాఢ్యాలు పేట్రేగిపోతున్న ప్రస్తుత సమ యంలో స్మరించుకోవడం ప్రగతిశీల ప్రజా ప్రత్యామ్నాయ శక్తులకి, ముఖ్యంగా ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరం!

(ఎనిమిదేళ్ళ క్రితం శంకర్ గుహ నియోగి గురించి ప్రచురించిన కరపత్రం, ఇంకా అప్పట్లో చత్తీస్‌గఢ్ దల్లీ రాజ్ హరాలోని షహీద్ హాస్పిటల్‌కి వెళ్ళినప్పుడు నియోగి సహచర మిత్రులు, కామ్రేడ్ డా.సయిబాల్ జానా గారి వద్ద నుండి తెచ్చుకున్న సాహిత్యం, శంకర్ గుహ నియోగి రచనలతో సహా... ఆయన జయంతి సందర్భంగా ఇలా స్మరిస్తూ..)










## త్యాగాల లక్ష్యం ఆశయాల శోధనే!

# రెండు ప్రత్యామ్నాయ విద్యాసౌధాలు

భారతీయ తొలి ముస్లిం అధ్యాపకురాలు, సంఘ సంస్కర్త ఫాతిమాషేక్ జయంతి రోజున ఒకేరోజు ప్రత్యామ్నాయ విద్య కోసం కృషి చేస్తున్న రెండు స్కూళ్ళకు వెళ్ళాను. రెండూ చత్తీస్‌గఢ్ రాయపూర్ లోనివే. ఒకటి బౌద్ధ ధర్మ సిద్ధాంతం, డా. బి. ఆర్. అంబేద్కర్ భావజాల ప్రభావంతో కొనసాగుతున్న తథాగత ఇంగ్లీష్ మీడియం స్కూల్. అక్కడ కల్సుకున్న మహారాష్ట్రకి చెందిన మిత్తానంద (మిత్రానంద/మైత్రేయా నంద) అనే యువ బౌద్ధ భిక్షువుతో అర్థవంతమైన సంభాషణ. రెండు ఎప్పటి నుంచో అనుకుంటున్న, అమరుడు చత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా యోధుడు శంకర్‌గుహ నియోగి భావజాల ప్రభావంతో 28 ఏళ్ళుగా కొనసాగుతున్న 'షహీద్ స్కూల్' !

బీద బస్తీపిల్లల కోసం కేవల చదువులు కాక మార్పు కోసం, మానవీయ వికాసం కోసం స్థాపించిన స్కూల్. అందులో గతంలో చదూకున్న విద్యార్థులే స్వచ్ఛంద కార్య కర్తలుగా కొనసాగుతున్న వైనం. లాల్‌హరా నియోగి నినాదం. మార్క్స్ గాంధీ అంబే ద్కర్‌ల మేలు కలయిక నియోగి అంటారు. పర్యావరణ పరిరక్షణను, కార్మికవ్యవస్థ విముక్తినీ సమాంతరంగా ఆశించిన విలువైన ఉద్యమ తాత్వికుడు నియోగి. అంతటి చైతన్యాన్ని తట్టుకునే చేవలేకనే బడా కార్పోరేట్ కంపెనీలు ఆ మహావ్యక్తిని భౌతికంగా హత్యచేసి తృప్తి పొందారు. ఆకాశంపైకి తూటాలు పేల్చి నింగిని నేలమట్టం చేసామనుకునే పిచ్చి వాళ్ళు, ఈ పెట్టుబడి కార్పోరేట్లు !

అలాంటి స్వాప్నికుడి సజీవ స్ఫూర్తితో రూపొందిన హాస్పిటల్ ఢిల్లీరాజ్‌హరా లో కార్మికులే నిర్మించుకుంటే, రాయపూర్‌లో స్కూలు, లైబ్రరీ నిర్మించుకున్నారు. పాత పెంకుటిళ్ళలో కొనసాగుతున్న ఆ షహీద్ పాఠశాల, గ్రంథాలయం చూసి తీరాలి. ఎరుపు ఆకుపచ్చ రంగుల యూనిఫాం లతో చిన్న కొట్టుగదుల్లో సుమారు మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రత్యామ్నాయ విద్యా విధానం కోసం ప్రతీ విద్యావేత్త, సామా జిక కార్యకర్త తెల్సుకోవాలి. అమరుల ఆశయాల కోసం నిలబడ తామనే ఉదయం ప్రార్థన గీతం ప్రతీరోజూ శంకర్ గుహ నియోగి స్మృతిలో విద్యార్థులు చదువుతారని విని ఆశ్చర్యపోయాను!

పాఠాలు, బోధనా ప్రక్రియలో సైతం వినూత్న విధానాలను అనుసరిచడం మాత్రమే

కాదు, బాల్యం నుంచే అక్కడ పిల్లలకి విత్తులువేడం నుండి నాట్లు వేయటం వరకూ వ్యవసాయ, ప్రకృతి జీవన విధానానికి సంబంధించిన అవగాహన కూడా కలిగిస్తున్నారు, పిల్లలు బస్తీ ప్రజల కోసం "బస్తీ న్యూస్" అనే పత్రిక కూడా నడుపుతు న్నారు. సావిత్రీ బాయి పూలే ముఖచిత్రంతో అక్కడ బోర్డు మీద అంటించిన పత్రిక చూసాను. అడిగిందే తడవుగా క్లాసులో పిల్లలంతా, ముఖ్యంగా బాలికలు సావిత్రిబాయి జీవితం గురించి స్పందించిన తీరుకి నా నోట మాట రాలేదు. ఈ నెలలో వాళ్ళు సావిత్రీబాయి పూలే నాటిక కూడా వేయబోతు న్నామనీ తప్పకుండా రమ్మనమని ఆహ్వానించారు !

అది కాదు నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం, ఝుర్నా అనే చురుకైన అమ్మాయి తో పాటూ అక్కడ పనిచేసే నలుగురు యువ వాలంటీర్లు గతంలో వరద ముంపు సమయంలో రాసిన యధార్థ కథలు 'బస్తీలో వరద' (బస్తీమే బాడ్) అనే పుస్తకం ప్రచురించగా, స్కూల్లోని మూడు, నాల్గవ తరగతి పిల్లలు "కార్మికుల జీవితాల్లో ఏవేం బాధలుం టాయ్?" అనే శీర్షికతో ఇరవై పుటల్లో ప్రతీ పేజీలో కార్మికుల కష్టాల గురించిన చిన్న వ్యాఖ్యకు అందమైన చిత్రాల్ని జోడిస్తూ ప్రచురించిన అద్భుతమైన పుస్తకం.నాకు తెలిసీ స్పష్టమైన శ్రామిక దృక్పథంతో ప్రాథమిక పాఠశాల పిల్లలు ప్రచురించిన దేశంలోనే తొలి పుస్తకం ఇదేనేమో. చిన్నగా తెలుగు చేయాలని ఉంది కానీ ఎంతవరకు అవుతుందో చూడాలి !

ఇవన్నీ ఒకెత్తయితే చరోదా ఊర్లోని స్టేషన్ దగ్గర రోడ్డుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించి రాజ్యాంగ పీఠిక బోర్డు పెట్టి "సంవిధాన్ చౌక్" అనే పేరు పెట్టడం చూడగానే నిజంగా సంతోషం అనిపించింది. భావోద్రేకాలు రెచ్చగొట్టడం కోసం ఎక్కడికక్కడ అవకాశ వాదంతో సొంత ప్రయోజనాల కోసం భక్తిని ఉద్రేకంగా మారుస్తున్న మూకలు ఒకవైపు పేట్రేగిపోతున్న క్రమంలో, రాజ్యాంగబద్ధమైన లౌకిక మానవీయ స్పృహ కోసం తపిస్తున్న వారి కృషి కచ్చితంగా నిరాశావాద వాతావరణంలో నిస్సందే హంగా నాలాంటివారికి ఎంతోకొంత బలాన్నీ, ఉత్సాహాన్ని కలిగించే విషయమే కదా !

(పోరాటాన్ని మాత్రమే ప్రతిపాదించే సైద్ధాంతిక విప్లవోద్యమానికి నిబద్ధతగల నిర్మాణాన్ని కూడా ప్రసాదించిన ఆచరణ శీలి నియోగి. షహీద్ స్కూల్ ఆయన కలలకి ప్రతిరూపం. ఇంకా హుయాన్ త్సాంగ్ సందర్శించిన ఒకనాటి కోసల రాజ్యం సిర్పూర్నుండి బలోదా వరకూ హడావుడిగానే ఐనా ఎప్పట్నుంచో వాయిదా వేస్తూ మొత్తానికి వేరే పని మీద వెళ్ళి తీరిక చేసుకుని చూసొచ్చిన సంగతులను తర్వాత రాస్తాను కానీ ప్రస్తుతం ప్రత్యామ్నాయ/మానవీయ వికాస విద్య కోసం ఉద్దేశించిన ప్రయత్నాల కోసమిలా సంక్షిప్తంగా ప్రస్తావిస్తూ ఆయా విషయాలతో ఈ చిన్న రైటప్ !

**– F.B. నుండి**


शहीद स्कूल कार्यालय
एवं हमारा पुस्तकालय


बस्ती न्यूज़


प्रार्थना
ये शहीदों हमारा नमन है नमन है।
हम तुम्हारे राहों पर चलेंगे
हम चलेंगे सब चलेंगे तुम्हारे ही रास्तों में।
ये शहीदों शक्ति दो बार-बार नमन है।
तोड़कर हर दीवार हिन्दु मुस्लिम करे प्यार।
वीरनारायण वीर नियोगी शहीदों का है पुकार
ये शहीदों शक्ति दो बार बार नमन है।
ना चलेगी गोलियां ना चलेगी डोलियां
नया नया फूल खिलेगा ये ऐसा चमन है।
ये शहीदों शक्ति दो बार-बार नमन है
तुम्हारे उस खून की कसम आज खाते हैं।
तेरे ही ताकत से तूफान से टकराते हैं
इंकलाब जिन्दाबाद-जिन्दाबाद-जिन्दाबाद।
यही स्वर गूंजेगा विश्व और गगन में
ये शहीदों हमारा नमन है नमन है।
शहीद शंकर गुहा नियोगी


हमारा छत्तीसगढ़
छत्तीसगढ़ मुक्ति मोर्चा
बस्ती में बाढ़
पढ़बो, लिखबो...
तो अपन हक बर
लड़बो!
जय
सावित्री!

# శంకర గుహ నియోగి రచనలు

